www.prajasakti.com
# ప్రజాశక్తి
మంగళవారం 28 నవంబర్ 2023
5
వైఎస్ఆర్

## ఫిర్యాదుదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

**కడప :** 'స్పందన' కార్యక్రమంతో పాటు మండల స్థాయిలో నిర్వహిస్తున్న 'జగనన్న చెబుదాం' అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు జెసి జి.గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్లు కౌసర్ భాను, ప్రత్యూష హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో సిపిఒ వెంకట రావు, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ వీరన్న, జిల్లా వ్యవసాయ అధికారి జెడి నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్‌ఇ శ్రీనివాస రెడ్డి, హౌసింగ్, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు పాల్గొన్నారు.

## 'ఆడుదాం ఆంధ్ర'ను జయప్రదం చేయాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - కడప**

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబోయే 'ఆడుదాం ఆంధ్ర' క్రీడోత్సవాలను జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో విజయవంతం చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామ రాజు అధికారులను అదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడోత్సవాల నిర్వహణపై కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల పైబడిన అన్ని వయసుల వారిని క్రీడలలో భాగస్వామ్యం చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం, ఆనందాన్ని సొంతం అవుతాయని ఆ దిశగా ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ దశల్లో క్రీడా పోటీలను నిర్వహి స్తోందని తెలిపారు. అందులో భాగంగా పురు షులు, మహిళల కోసం 5 విభాగాల్లో వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహిస్తోందని చెప్పారు. బ్యాడ్మి ంటన్, క్రికెట్, కబడ్డీ, ఖో-ఖో, వాలీ బాల్‌లతో పాటు అన్ని స్థాయిలలో మూడు అదనపు గేమ్‌లను కవర్ చేస్తుందన్నారు. 3 కె మారథాన్, యోగా, టెన్నికాయిట్ ఆ ప్రాంతంలోని ప్రసిద్ధ సాంప్రదాయ ఆటలను.. గ్రామ సచివాలయ, మండల, నియోజ కవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తారన్నారు. క్రీడాకారులు సంబంధిత గ్రామ/వార్డు సచివాల యాల నివాసంగా ఉండాల న్నారు. వారి ఆధార్ కార్డ్ లేదా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డుతో పోటీలకు నమోదు చేసుకో వచ్చన్నారు. మండల స్థాయిలో అన్ని సచి వాల యాల పరిధిలో నిర్వహించే క్రీడా పోటీలను సోషల్ మీడియా, లోకల్ ఛానెల్స్, ప్రెస్ ద్వారా విస్తృత ప్రచారం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు నియో జకవర్గాల స్థాయిలో, నియోజకవర్గాల వారీగా ఎంపికైన విజేతలకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలో ఈ డిసెంబర్ 15 నుంచి 2024 జనవరి 20 వరకు, అలాగే గ్రామ స్థాయిలో విజేతలకు డిసెంబర్ 21 నుంచి జనవరి 4 వరకు 12 రోజుల పాటు మండల స్థాయిలో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. జన వరి 5వ నుండి 10 వరకు 5 రోజుల పాటు నియోజకవర్గ స్థాయిలో, జనవరి 11 నుండి 20 వరకు 7 రోజుల పాటు జిల్లా స్థాయిలో పోటీ లుంటాయని వివరించారు. జనవరి 26 న రాష్ట్ర స్థాయి పోటీలు విశాఖపట్నంలో నిర్వహి స్తామన్నారు. క్రీడల్లో పాల్గొనే ఔత్సాహికులు డిసెం బర్ 27 నుంచి www. aadudamandhra.ap.gov.in ద్వారా ఆన్ లైన్లో కానీ, గ్రామ వాలంటీర్ల ద్వారా డోర్ టు డోర్ క్యాం పెయిన్‌లో కానీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలకు మాత్రమే నగదు బహుమతులు అందజేస్తారని తెలిపారు.

## బ్రిడ్జి నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు : సిపిఎం

**ప్రజాశక్తి - కడప అర్బన్**




సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

నగరంలోని బుగ్గవంక మీద షామీరియా మసీదు వద్ద బ్రిడ్జి నిర్మాణంలో నిర్లక్ష్యం తగదని సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్, నగర కమిటీ సభ్యురాలు ఎస్. జమీల పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పాత బస్టాండ్‌లోని సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షామీరియా మసీదు వద్ద బుగ్గవంక మీద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు వస్తున్న సందర్భంగా అయినా అధికార పార్టీ నేతలు స్పందించాలన్నారు. కొద్ది నెలలుగా బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించామని చెప్తున్న ప్రకటనలు నీటి మూటలు అయ్యాయని విమర్శించారు. బడ్జెట్‌లో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించామని చెప్పి ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకుండా పోయిందన్నారు. నగరంలో ఉన్న సర్కిల్ విస్తరించటం, కుదించటం మీద ఉన్న శ్రద్ధ ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల మీద శ్రద్ధ చూపకపోవడం సమంజసం కాదన్నారు. సర్కిల్ విస్తరణ ప్రజానీకం అడగకపోయినా చేస్తున్నారు, బుగ్గవంక మీద బ్రిడ్జిలు కావాలని పోరాడుతున్నా స్పందించకపోవడం దుర్మార్గమని వాపోయారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో మసీదు బ్రిడ్జి నిర్మాణం ప్రత్యేక ప్రచార అంశంగా చర్చ చేయబోతున్నామని వారు పేర్కొన్నారు. షామీరియా మసీదు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే జోక్యం చేసుకుని పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కలుపుకుని పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

## డిఎస్‌సి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి

**ప్రజాశక్తి - బద్వేలు**

ఎమ్మెల్యే డాక్టర్ సుధాకు వినతి పత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

రాష్ట్రంలో నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని, లేకపోతే భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువకులను కలుపుకొని ఆందోళన చేపడతామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధా, డిఇఓ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు ఆరు లక్షల పైగా నిరుద్యోగులు బిఇడి, టిటిసి పూర్తి చేసి కోచింగ్ తీసుకుని ఎప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందా అని ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాలుగా నిరాశే మిగిల్చిందని, కనీసం ఇప్పుడైనా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వని ఏకైక ప్రభుత్వం వైసిపికే అన్నారు. ఖాళీలకు సంబంధించి విద్యాశాఖ మంత్రి మాత్రం నోటీసు వచ్చినప్పుడు మాట్లాడుతున్నారని వారు విమర్శించారు. పార్లమెంటులో చెప్పిన లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 40 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయని, ఇప్పటికే రాష్ట్రంలో 8 వేలకు పైగా ఏ కే ఉపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. 1.88 లక్షల ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట ఇప్పుడు కేవలం 1.69 మంది ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారని వాపోయారు. జనవరిలో వేలాదిమంది ఉపాధ్యాయులు రిటైర్మెంట్ అవుతున్నారని తెలిపారు. రేషన్ లైజేషన్ పేరుతో 10 వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దుచేసిందని తెలిపారు. తెలుగు మీడియం తీసివేసి మరో 15వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన విద్యా విధానం 20 20 పేరుతో 5 వేల పాఠశాలలను మూసివేసిందని, ఈ ప్రభుత్వానికి నిరుద్యోగ యువతీ యువకుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్షుడు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, పట్టణ ట్రెజరర్ వీ సురేంద్ర, పట్టణ నాయకులు ఓబుల్ రెడ్డి, ఇమ్మానేలు పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం

### - బోర్డు సభ్యులు షామీర్ బాషా

**ప్రజాశక్తి - కడప అర్బన్**

పనులు పరిశీలిస్తున్న రైల్వే బోర్డు సభ్యులు షామీర్‌బాషా

కడప రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతూ ఉన్నాయని రైల్వే బోర్డు సభ్యులు, పులివెందుల వైసిపి మైనారిటీ నాయకులు షామీర్ బాషా చెప్పారు. సోమవారం రైల్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సుమారు రూ.45 కోట్లతో కడప రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద చేపడుతున్నట్లు చెప్పారు. స్టేషన్లలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పర్యవేక్షించినట్లు పేర్కొన్నారు. ఒకటో ప్లాట్ ఫారం పైన ఎక్సలేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్లాట్ ఫారం విస్తరణ చేస్తున్నామన్నారు. రెండు, మూడు ఫ్లాట్ ఫారాలలో విభిన్న ప్రతిభావంతులు ఎక్కి, దిగడానికి వీలుగా లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. టిటిల విశ్రాంతి భవనాన్ని అన్ని హంగులతో నిర్మిస్తున్నట్లు వివరించారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా త్వరలో ఒకటో ఫ్లాట్ ఫారం, టికెట్ కౌంటర్, ఇతర విభాగాలను కాస్త ముందుకు తీసుకెళ్లి విస్తరిస్తున్నారమని తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి అమృత్ భారత్ స్కీమ్ క్రింద కడప స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ అభివృద్ధి పనులను పరిశీలించారు.

## జగనన్న ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు

### - కలెక్టర్ విజయ్ రామరాజు

**ప్రజాశక్తి - కడప**

జగనన్న గృహాలను శరవేగంగా పూర్తిచేయాలని, ప్రజలకు నిర్దేశిత గడువు లోపు అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ.. నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ వి. విజయ్ రామ రాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవన్ నుంచి జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి ఓటర్ల సవరణ జాబిత, జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, ప్రయారిటీ బిల్డింగ్స్, నాడు-నేడు పనుల పురోగతి, విద్యాదీవెన, చేయుత, అమ్మ ఒడి,నేతన్న నేస్తం, కాపు నేస్తం, వాహన మిత్ర తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా జిల్లాలో ఫారమ్ - 6 ఫారమ్-7, ఫారమ్-8 పెండిన్సిలు, అన్ ప్రాసెస్డ్ అప్లికేషన్లను ఎప్పటికప్పుడూ పూర్తి చేసి అప్డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు వచ్చి 30 రోజులు దాటినా అప్లికేషన్లపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలన్నారు. బిఎల్‌ఒలతో మీటింగ్ ఏర్పాటు చేసుకోవాలని ఇఆర్‌ఒలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్మిస్తున్న సచివాలయ భవనాల నిర్మాణాల విషయంలో కుడా అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గృహనిర్మాణ లక్ష్యాన్ని త్వరితగతిన నిర్ణిత గడువులోగా సాదించాలని అన్నారు. గృహ నిర్మాణ పనుల్లో అధికారులు చిత్త శుద్దితో పనిచేసి నిర్దేశించిన, ఆశించిన పురోగతిని చూపాలని అన్నారు. కార్యక్రమంలో కడప,బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్‌డిఒలు మధుసూదన్, వెంకట రమణ, వెంకటేష్, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఎస్‌ఒలు, సంబధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

## డ్రాగా ముగిసిన మ్యాచ్

**ప్రజాశక్తి - కడప**

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-23 మల్టీ డే ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంటులో భాగంగా కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో మూడు రోజులపాటు నార్త్ జోన్, రెస్ట్ ఆఫ్ జోన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్ లో రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు 134 పరుగులు చేసింది. నార్త్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 272 పరుగులు చేసింది. ఒక వికెట్ నష్టానికి 137 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు 99.5 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. వర్షం కారణంగా మ్యాచ్ ఆగిపోవడంతో డ్రాగా ముగిసింది. నార్త్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో ఆధిక్యత సాధించింది.

### మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సాధించిన సెంట్రల్ జోన్

ఐదు వికెట్లు తీసుకున్న ఆదిల్ హుసేన్

కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన వేరొక మ్యాచ్‌లో సెం ట్రల్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సా ధించింది. ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో సెంట్రల్ జోన్ జట్టు 374 పరుగులు చేసింది. సౌత్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 362 పరుగు చేసింది. ఒక వికెట్ నష్టానికి 36 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారం భించిన సెంట్రల్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 49.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఆ జట్టులోని వంశీకృష్ణ 81 పరుగులు చేశారు. సౌత్ జోన్ జట్టులోని ఆదిల్ హుస్సేన్ 5 వికెట్లు తీసుకున్నాడు.

## త్వరలో సినీ తారల క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు

**ప్రజాశక్తి - కడప**

సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

త్వరలో కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎస్ స్టేడియంలో సినీ తారల సెలబ్రిటీ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసో సి యేషన్(ఎసిఎ) సిఇఒ ఎం.వి. శివారెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు భరత్ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం సెలబ్రిటీ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లకు సంబంధించి ఎసిఎ స్టేడియాన్ని సినీ తారలు మధునందన్, శ్రవణ్, ఖయ్యూం సందర్శించారు. స్టేడియాన్ని, క్రికెట్ నట్స్‌ను పరిశీలించారు. నెట్స్‌లో కాసేపు ప్రాక్టీస్ చేసి ఆనందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఎసిఎ నిర్వాహకులు మాట్లాడుతూ డిసెంబర్ లేదా జనవరిలో సినీ తారల సెలబ్రిటీ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు ఉంటాయని తెలిపారు. ఫ్లడ్ లైట్స్‌లో డే అండ్ నైట్ సినీ తారల మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పృథ్వి, సభ్యులు ముని కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## 'టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేరు'

**ప్రజాశక్తి -కడప అర్బన్**

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

యువగళం పాదయాత్ర తిరిగి ప్రారంభం కావడంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెన్నులో వణుకు పుట్టిందని, రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేరని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు, సీనియర్ నాయకులు ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మన్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం 40వ డివిజన్‌లో 'బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం డివిజన్ అధ్యక్షులు రామానుజులురెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రవీంద్ర నగర్, కాగితాల పెంటలో టిడిపి, నాయకులు కార్యకర్తలు వందలాది మందితో ప్రచారం నిర్వహించామని పేర్కొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పాల్గొని జయప్రదం చేశారని తెలిపారు. యువ నేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభమైందని, విశాఖలో ముగింపు సభ పెద్ద ఎత్తున చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 160 సీట్లు సాధించడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, కడప నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, 42 వ డివిజన్ ఇన్‌ఛార్జి అంబవరం రామాంజనేయ రెడ్డి, కడప నగర ఉపాధ్యక్షులు మరియు ప్రముఖ న్యాయవాది లింగాల శివ శంకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు జయరాం రెడ్డి, కడప తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పాత బస్టాండ్‌లో పనిచేయని సిసి కెమెరాలు

**ప్రజాశక్తి- కడప అర్బన్**

రోజురోజుకూ పాత బస్టాండ్ లో దొంగతనాలు పెరుగుతున్నాయని, ఆర్‌టిసి అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సిసి కెమెరాలు పనిచేయడం లేదని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పాత బస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న సిసి కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఆకతాయిలు దొరికిన కాడికి పర్సులు, బ్యాగులు, డబ్బులు, విలువైన వస్తువులు చోరీలు చేస్తున్నారని పేర్కొన్నారు. కడప పాత బస్టాండ్ లో ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేసే ప్రయాణికులు భయభ్రాంతులకు గురి అవుతున్నారన్నారు. పోలీస్ వారు నిఘా పెట్టక పోవడం చేత ,సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేయక పోవడంతో దొంగతనాలు అధికమయ్యాయని వాపోయారు. వెంటనే పోలీస్ వారు సీసీ కెమెరాలను ఉపయోగం తీసుకురావడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, సహాయ కార్యదర్శి యూసఫ్, నాయకులు నాగార్జున, జగదీష్, ఉదయ్ పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయి విజ్ఞాన యాత్రలో రైతులు

## నైపుణ్య శిక్షణలో విజ్ఞాన యాత్ర

**ప్రజాశక్తి చింతాకొమ్మదిన్నె**

'ఆత్మ' సహకారంతో చిరుధాన్యాల విలువ జోడింపుపై నైపుణ్య శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఏరువాక కేంద్రం, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ రామలక్ష్మి దేవి, ఆత్మ డిపిడి పద్మలత ఆధ్వర్యంలో సోమవారం యువ రైతులు, మహిళా రైతులు,అభ్యుదయ రైతులు విజ్ఞాన యాత్ర నిర్వహించారు. మండలంలోని తాడిగొట్లలో అవని ఆర్గానిక్స్‌ను సందర్శించారు. సంస్థ యజమాని సునీల్ కుమార్ మాట్లాడుతూ చిరుధాన్య ఉత్పత్తులకు ఇతర రాష్ట్రాలలో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. తమ సంస్థ నుంచి తయార్యేచ ఉత్పత్తులు బెంగళూరు, చెన్నై, పూణెస్త్ర వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటామని చెప్పారు. చిరుధాన్యాలను శుద్ధి చేసి, పొట్టు తీసే విధానాలు, వాటికి అవసరమయ్యే యంత్ర పరికరాలు, తయారీకి అయ్యే ఖర్చు వివరాలు వివరించారు. త్వరలో కొత్త యంత్రాలతో భారీగా కొప్పర్తి వద్ద మరో యూనిట్‌ను ప్రారంభించబోతున్నామన్నారు. తర్వాత చిరుధాన్య ఉత్పత్తులతో కడప రైతు బజారులో ఔట్ లెట్ యూనిట్ నడుపుతున్న రంగారెడ్డి మాట్లాడుతూ కడప పట్టణంలోని ప్రకాశ్ నగర్ లో చిరుధాన్య ఉత్పత్తులు తయారు చేసి నెల్లూరు, కర్నూలు, అనంతపురంలోని షాపులకు ఆర్డర్ల పైన ఉత్పత్తులు పంపుతున్నామని తెలిపారు.

## కెవికెకు అంతర్జాతీయ పురస్కారం

**ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె**

పురస్కార వేడుకల్లో కెవికె సమన్వయ కర్త

ఊటుకూరు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రానికి అంతర్జాతీయ పురస్కారం లభించిందని కెవికె సమన్వ యకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాదులో నిర్వహించిన న్యూట్రి హబ్, భారత చిరుధాన్యాల సంస్థ హైదరాబాద్ వారు నిర్వహించిన 'అంతర్జాతీయ న్యూట్రి సీరి యల్స్ సదస్సు 5.0' లో కృషి విజ్ఞాన కేంద్రం అంతర్జాతీయ చిరుధా న్యాలను ప్రోత్సహిస్తుందుకు గాను పురస్కారంతో సత్కరించిందని పేర్కొన్నారు. పురస్కారాన్ని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ న్యూఢిల్లీ, డాక్టర్ సురేష్ కుమార్ చౌదరి చేతుల మీదుగా స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు, కార్యక్రమంలో శాస్త్రవేత్త ప్రశాంతి పాల్గొన్నారు.

## నేడు క్రైస్తవ సమైక్య సమావేశం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

క్రైస్తవులందం ఐక్యతతో కలసి మన హక్కులను సాధించుకుందామని కడప ఆరోగ్యమాత చర్చి డైరెక్టర్ ఫాదర్ ఎం.డి. ప్రసాదరావు అన్నారు. సోమవారం ఆరోగ్యమాత కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం క్రైస్తవుల పరిరక్షణ ప్రతినిధిగా గుంటూరు మేత్రాసన గురువులైన డాక్టర్ రెవరెండ్ ఫాదర్ బాలస్వామిని నియమించిందని చెప్పారు. నగరంలో సిఎస్ఐ చర్చిలో డాక్టర్ రెవరెండ్ బిషప్ గాలి బాలి, డాక్టర్ రెవరెండ్ బిషప్ ఐజాక్ యేసు వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10:00 గంటలకు సమావేశం నిర్వహించనున్నారని తెలిపారు. రాష్ట్రంలోని క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే విధంగా ఆయన పని చేస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే సంఘాలలో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే వినతి పత్రాల ద్వారా సమావేశం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశానికి జిల్లాలోని క్రైస్తవ ప్రతినిధులు, పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

డిఆర్ఒ దేవేంద్రగౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

## ఆస్పత్రుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి - కడప అర్బన్**

నగరంలో, జిల్లాలో పేదలు వైద్యం కోసం ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్తే ఓపి ఫీజును విపరీతంగా పెంచేసి ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న ఆసుపత్రుల యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాలశివకుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందనలో డిఆర్ఒ దేవేంద్ర గౌడ్‌కు డివైఎఫ్ఐ అధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలను జిల్లాలో ప్రయివేట్ ఆసుపత్రులు నిలువు దోపిడీ చేస్తున్నాయన్నారు. కడప, ప్రొద్దుటూరు లాంటి ప్రాంతాలలో డాక్టర్ కన్సల్ట్ ఒక్క ఓపీ ఛార్జి రూ. 400 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. పేదవాడు వైద్యం చేయించుకోవాలంటే ఖరీదు అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడం లేదన్నారు. ఆసుపత్రులలోనే మెడికల్ షాపులు నిర్వహిస్తూ అర్హత లేకుండా ఫార్మసిస్ట్ లేకుండా నడుపుతున్నారని పేర్కొన్నారు. టెస్టులు, స్కానింగ్‌ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఎక్కడా ధరల పట్టిక లేదన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్షంగా ఆసుపత్రుల ముందు ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు షాకీర్ పాల్గొన్నారు.

## 'ఆంధ్రులకు అన్యాయం'

**ప్రజాశక్తి - కడప**

సమావేశంలో మాట్లాడుతున్న చీకటి చార్లెస్

ఆంధ్రులకు మోడీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విభజించడానికి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం రూపొందించారన్నారు. ఈ బిల్లు ఉభయ సభ ఆమోదం పొంది 2014 మార్చి 31న చట్టమై 2014 జూన్ 2 నుండి అమలులోకి వచ్చిందన్నారు. ఈ చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు అనేక హామీలు ఇచ్చారని, తొమ్మిదేళ్లుగా దేశాన్ని ఏలుతున్న నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం ఆ హామీలు వేటిని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా కల్పించకపోవడంతో వ్యవసాయక రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా పురోగమించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 2024 సాధారణ ఎన్నికలు జరగబోతున్న తరుణంలో నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని బిజెపితో జత కట్టే పార్టీలను నిలదీయాలని పిలుపునిచ్చారు. 2019 మేలో వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధాని అంశంతో వివాదం చేయడంతో రాజధాని అంశం న్యాయస్థానాల పరిధిలోకి వెళ్ళింది అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన నిర్దేశాలు ఇవ్వకుండా నాటకాలు ఆడుతుందన్నారు. సమావేశంలో ఓబీసీ జిల్లా చైర్మన్ చిన్న కుల్లాయప్ప, జిల్లా మైనార్టీ వైస్ చైర్మన్ షేక్ అబ్దుల్ రసూల్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తులు పంపిణీ

**కలసపాడు :** స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో సుమారు 216 మంది విద్యార్థులకు క్రిస్మస్ నూతన సంవత్సర సందర్భంగా ఎఫ్‌సిఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్‌రెడ్డి సహాయ సహకారాలతో ఎఫ్‌సిఎన్ ఫౌండేషన్ ప్రతినిధులు చిత్త రాజశేఖర్ రెడ్డి, చిత్త ప్రభావతి ఆధ్వర్యంలో సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ చిత్త ప్రభావతి మాట్లాడుతూ మండలంలో పేద విద్యార్థులకు చదువుకునేందుకు ఏటా రూ. 14 వేలను ఆర్థిక సాయం అందజేస్తున్నామని చెప్పారు. కరస్పాండెంట్ చిత్త రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అనాథలకు ఎప్పుడైనా, నిరంతరం చదువు చెప్పినందుకు తాము అందుబాటు లో ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పాన్సర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఎస్ఐ అరుణ్‌రెడ్డి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కొత్తగా పులివెందుల అర్బన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన అరుణ్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. సికె దిన్నె నుంచి అరుణ్‌రెడ్డి పులివెందులకు బదిలీ అయ్యారు.

## పీజీ విద్యకు విద్యార్థులు దూరం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

పేద విద్యార్థులకు పీజీ విద్యను జగన్ ప్రభుత్వం దూరం చేసిందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల పాలిట శకుని మామలా, కంస మామలా ముఖ్యమంత్రి జగన్ తయారయ్యారని విమర్శించారు. విద్యార్థులకు నష్టం కలిగించే జిఒ 77ను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఇబిసి, కాపు, వికలాంగ ప్రతిభావంతుల పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యను అందించాలని 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వీటివల్ల అటు డిగ్రీ, ఇటు పీజీ విద్యార్థులకు మేలు జరిగిందన్నారు. జగన్ ప్రభుత్వం వీటి పేర్లు మార్పు చేసి జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన అని పెట్టారన్నారు. అంతటితో ఆగకుండా ఈ పథకాలు పీజీ విద్యార్థులకు వర్తించవని జిఒ 77 జారీ చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.550 కోట్లను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**నివాళులర్పించిన తులసిరెడ్డి**

చక్రాయపేట : సిపిఐ పులివెందుల ఏరియా జాయింట్ సెక్రటరీ కొత్త కాలువ ప్రభాకర్ తండ్రి రామకృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో అమర్‌నాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఉత్తన్న, రామకృష్ణయ్య, వినయ్ పాల్గొన్నారు.

## స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని 8వ కౌన్సిలర్ వార్డులో ఉన్న శ్రీసీతారామలక్ష్మణ ఆలయం అభివృద్ధికి స్థలం కేటాయించాలని ఆ ప్రాంత ప్రజలు సోమవారం నగర పంచాయతీ కమిషనర్ పగడాల జగన్నాథ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా ఏళ్లగా పూజారి లేక నిత్య దీపారాధన జరగడం లేదన్నారు. దేవాలయానికి ఆదాయ వనరు లేని కారణంగా శాశ్వత పూజారిని నియమించుట, దీపారాధన వంటివి లేవన్నారు. పట్టణంలోని బస్టాండ్ పక్కనున్న ప్రభుత్వ స్థలంలో పది సెంట్లు ఆలయానికి కేటాయించాలని వారు కమిషనర్‌ను కోరారు. ప్రభుత్వ ఖాళీ స్థలంలో దాతల సహకారంతో శాశ్వత రేకుల షెడ్డు, రూములు నిర్మించి వచ్చే బాడుగల ఆదాయంతో పలు కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఆ మేరకు శ్రీరాములపేట వాసులతో సంతకాలు సేకరించి వినతి పత్రాన్ని కమిషనర్‌కు అందించారు. కమిషనర్ జగన్నాథ్ స్పందిస్తూ ఆలయానికి స్థలం కేటాయించే విషయాన్ని కౌన్సిల్ ఎజెండాలో పొందుపరుస్తామన్నారు. కార్యక్రమంలో రాజా, హనుమారెడ్డి, మూలె రామాంజనేయరెడ్డి, శంకర్, మూలె సాయికిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న శ్రీరాములపేట వాసులు

## అలరించిన కోలాటం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థాన ఆవరణలో కార్తీక రెండవ సోమవారం సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను అలరించింది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మహిళా కళాకారులు ప్రదర్శించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో అల్లాడుపల్లెకు చేరుకున్నారు. గ్రామ సమీపంలోని కుందు నదిలో కార్తీక స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఇఒ శ్రీనివాసులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. అల్లాడుపల్లె సర్పంచ్ జిఎ కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య సర్వజన కల్యాణ మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కోలాటం ప్రదర్శిస్తున్న మహిళా కళాకారులు

## ముగిసిన పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా నిర్వహించిన పవిత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు మండలం నుండేకాక జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి, వేద పారాయణదార్ రామ మోహనశర్మ, చైర్మన్ పినిపోల రాఘవేంద్ర ప్రసాద్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి పాల్గొన్నారు.

పవిత్రోత్సవాల్లో వేద పండితులు, ఎసి, చైర్మన్

- మండలంలోని వేంపల్లి-రాయచోటి మెయిన్ రోడ్డు సురభి గ్రామ నాగలగుట్టపల్లె, దేవరగుట్టపల్లె మార్గమధ్యంలో ఉన్న దశరథ మహారాజు దేవాలయం వద్ద కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని సోమవారం దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ సానే సుబ్బరామయ్య, దశరథ మహారాజు ట్రస్ట్ చైర్మన్ సోమ దశరథ ఆధ్వర్యంలో వాల్మీకి రామాయణ పారాయణం, సీతారామ కల్యాణం నిర్వహించారు. కడప అవార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన, నటరాజ కళాక్షేత్రం ప్రొద్దుటూరు వారి నాట్య విశారద, మొహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో భక్తులు అలరించేలా నాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## కోడూరులో అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని వై.కోడూరులోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి సన్నిధిలో అయ్యప్పస్వామి మహా పడిపూజ, గ్రామోత్సవాన్ని అయ్యప్పస్వామి సేవా సంఘం సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పడిపూజకు మండలంలోని మాలధారులు, భక్తులు తరలివచ్చారు. బండి రమణారెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వినియోగాన్ని నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని గ్రామ వీధుల్లో కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అయ్యప్ప సేవా సమితి సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

పడిపూజలో అయ్యప్ప మాలధారులు

# ముందు జాగ్రత్తలతోనే అధిక దిగుబడి

అరటి ఆకులకు ఆశించిన ఆకుమచ్చ తెగులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

అరటి తోటలో సిగటోక తెగులు నివారిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఉద్యాన శాఖ విస్తరణ అధికారి వీరారెడ్డి పేర్కొన్నారు. దీనిపై ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని అరటి తోటల్లో సికటోక తెగులు వ్యాపించిందన్నారు. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధ్యమని ఆయన సూచించారు.

**సిగటోక ఆకుమచ్చ తెగులు లక్షణాలు..**

ఆకులపై మొదట అక్టోబర్ నెలలో సమాంతరంగా చిన్నచిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. ఇవి క్రమేపీ పెరిగి పెద్దవై బూడిద రంగులోకి మారుతాయి. ఈ మచ్చలు గోధుమ రంగులోకి మారి పరిమాణంలో పెద్దవై ఒకదానితో ఒకటి కలిసిపోతాయి. ఈ మచ్చలు ముందుగా కింది వరుస ఆకులలో ప్రారంభమై క్రమేణా పై ఆకులకు వ్యాపిస్తాయి. తెగులు ఉధృతి పెరిగినప్పుడు మచ్చలు కలిసిపోయి ఆకులు మొత్తం ఎండిపోతాయి. కిరణజన్య సంయోగ క్రియకు అవసరమైన పచ్చదనం లేకపోవడంతో మొక్కలు గెలలు వేసినప్పుడు అవి పండక ముందే కాయలు రాలిపోయే అవకాశం ఉంది.

**నివారణ చర్యలు..**

తెగులు వ్యాప్తి మొదలైనప్పుడు ప్రొపికొనజల్(ఒక మిల్లీమీటర్ లీటరు నీటికి)తోపాటు మినరల్ ఆయిల్(పది మిల్లీలీటర్లు లీటరు నీటికి) కలిపి ఆకులు మొత్తం తడిసేలా పిచికారి చేయాలి. రెండో పిచికారిలో కార్బన్ డిజైన్‌తోపాటు మ్యాన్కోజబ్ మిశ్రమం మందును(ఒక గ్రాము లీటరు నీటికి), మూడవ పిచికారి ట్రైఫ్లోక్స్ స్ట్రోబిన్‌తోపాటు డెబ్యూకొనజల్ మిశ్రమం మందు(1.4 గ్రాములు లీటర్ నీటికి), నాలుగో పిచికారిలో డైపన్ కొనజోల్(ఒక మిల్లీమీటర్ లీటరు నీటికి) కలిపి పిచికారి చేయాలి. ప్రతి పిచికారిలో స్టిక్కర్ గాని సబ్బు పొడిని గాని కలపాలి.

**- వీరారెడ్డి, ఉద్యానశాఖ విస్తరణాధికారి, సింహాద్రిపురం**

# 'భూపేష్ గెలుపు.. అభివృద్ధికి మలుపు'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి గెలుపు జమ్మలమడుగు అభివృద్ధికి మలుపు అని ఆ పార్టీ కన్నెలూరు గ్రామ నాయకులు కె.నవనీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 2019 ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీలో ఉన్న నాయకులు ఆదినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి పార్టీని వీడి.. ఒకరు బిజెపి, మరొకరు వైసిపిలోకి వెళ్లారన్నారు. టిడిపికి నాయకుడు లేక పోవడంతో చిన్న వయసులోనే భూపేష్‌రెడ్డి పార్టీని తన భుజస్కంధాలపై వేసుకున్నారన్నారు. రెండేళ్లుగా ఆయన నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలను ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఇక్కడి వైసిపి ప్రతినిధి అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలకు చేరువ వుతున్నారన్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ గుర్తించేలా తన విధివిధానాలు రూపొందించుకున్నారన్నారు. ఇదే క్రమంలో లోకేష్ యువగళం పాదయాత్రలో జమ్మలమడుగులో భారీస్థాయిలో జనం వచ్చారన్నారు. ఈ సందర్భంగా లోకేష్, భూపేష్ కలయిక అదిరిందని స్వయంగా లోకేష్ చేతనే చెప్పించుకున్న నాయకుడు భూపేష్‌రెడ్డి అన్నారు. దేవగుడి కుటుంబం అభివృద్ధికి మూల స్తంభమన్నారు. అలాంటి కుటుంబం నుంచి వచ్చిన భూపేష్‌రెడ్డిని 2024లో ఎమ్మెల్యేగా గెలిపించుకొని ఈ ప్రాంతాన్ని

మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న భూపేష్‌రెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి

అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇక్కడి ప్రజాప్రతినిధి చేతిలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందన్నారు. భవిష్యత్తులో జమ్మలమడుగు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే రాష్ట్రంలో చంద్రబాబు, నియోజకవర్గంలో భూపేష్‌రెడ్డి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అభివృద్ధి చేసే వారిని గుర్తించి ఓటు వేయాలని నవనీశ్వర్‌రెడ్డి ప్రజలను కోరారు.

# ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

బండలాగుడు పోటీల ప్రారంభ కార్యక్రమంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలోని శివ భక్తేంద్రాలయం, పుల్లూరు సమీపంలోని నాగనాథేశ్వర ఆలయ శైవక్షేత్రానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. మైదుకూరు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఎంపిపి అబూబకర్ సిద్దిక్, పుల్లూరు ఉపసర్పంచ్, వైసిపి నాయకులు ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, ఆంజనేయ కొట్టాల సర్పంచ్ పెద్దిరెడ్డి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్, డీలర్ చంద్ర, సచివాలయ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ఎంపిటిసిలు సభ్యులు, వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు, కాశినాయన ఆలయం వద్ద ఏర్పాటుచేసిన కోలాటం అలరింపజేసింది. వైసిపి మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. అనంతరం పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.

# ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలి : 'పుట్టా'

ప్రజాశక్తి - ఖాజీపేట

రానున్న 2024 ఎన్నికల్లో ప్రజలందరూ టిడిపిని ఆదరించాలని, ముఖ్యమంత్రిగా చంద్రబాబును నియమించుకునే బాధ్యత ప్రజలందరిదని మైదుకూరు పార్టీ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీలోని ఎస్సీ కాలనీలలో సోమవారం పుట్టా సుధాకర్ యాదవ్ బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. టిడిపి మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండలశాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, నాయకులు ఇరగంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య యాదవ్, పత్తూరు ఉపసర్పంచ్, టిడిపి యువ నాయకులు ముత్తూరు రమణ, కమలాపురం ఫరూక్ అహ్మద్, కమలాపురం గౌస్ మొహిద్దీన్, జెండాల మహబూబ్ బాషా, గోవిందు సుబ్బయ్య, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు గంగాధర్, డాక్టర్ ఆసిఫ్, పిచ్చి నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

**వైసిపి నుంచి పలువురు టిడిపిలో చేరిక**

పుల్లూరు పంచాయతీ పాత పుల్లూరు దళితవాడకు చెందిన పలువురు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన కమ్మా నరసింహులు, విజయ్, మీసాల రమేష్, రవి, నాగేంద్ర టిడిపి మైదుకూరు

మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న పుట్టా, లక్ష్మిరెడ్డి

నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా వేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వంపై విసుకు చెంది ప్రజలందరూ టిడిపి తీర్థం పుచ్చుకుంటున్నారన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో టిడిపి బలోపేతం అవుతోందన్నారు. కార్యకర్తలు, గ్రామ నాయకులు కూడా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కులందరూ కూడా ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

# వ్యత్యాసాన్ని గమనించి మద్దతివ్వండి : ఎమ్మెల్యే

పజాశక్తి - ప్రొద్దుటూరు

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

గత పాలకులకు తనకు వ్యత్యాసాన్ని గుర్తించి మద్దతివ్వండని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి కోరారు. స్థానిక 17వ వార్డులో రూ.30లక్షల అంచనాతో రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15రోజుల క్రితం ఇక్కడకు వచ్చిన సమయంలో రోడ్డు కావాలని స్థానికులు అడిగారన్నారు. ఇక్కడి ప్రజల అవసరాన్ని గుర్తించి నేడు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. వారంలో రోడ్డు పనిని పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో రూ.110కోట్లతో మౌలిక వసతులు, రూ.150కోట్లతో మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. ప్రజలకు అత్యంత అవసరమైన ఈ అభివృద్ధి పనులను గత పాలకులు ఎందుకు చేయలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మిదేవి, కౌన్సిలర్ చింతకుంట సరితారెడ్డి, డిఇ రమణ, వైసిపి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యం.. ఆదమరిస్తే ప్రమాదం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వరిపైరు నూర్పిడి అనంతరం రైతులు ధాన్యాన్ని ప్రధాన రోడ్లమీద ఆరవేస్తున్నారు. ఆ రోడ్లపై వెళ్లే వాహనదారులు ఆచీతూచీ వెళ్లాల్సి ఉంది. ఏమాత్రం ఆదమరిచినా వాహనం అదుపుతప్పే ప్రమాదం ఉంది. జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు పోయే రహదారిలోనూ, జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు పోయే మార్గంలోనూ గూడెం చెరువు, అంబవరం, అనంతగిరి, ధర్మపురం, గొరిగనూరు, దానవులపాడు, సుగుమంచిపల్లె తదితర గ్రామాల రైతులు రోడ్డు పక్కనే ఉన్న పంటలను నూర్పిడి చేసి ఆరబెట్టుకుంటున్నారు. మేఘాలు ఆడుతున్నందున వరి కయ్యలు తడిగా ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు వరి ధాన్యాన్ని రోడ్లమీద వేశారు. ద్విచక్ర వాహనదారులు, పెద్ద వాహనాలు పగలు.. రాత్రి వేగం తగ్గించి రావాల్సి ఉంటుంది. లేకుంటే అటు వాహన దారులకు, ఇటు రైతులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

**పది మూటలు రూ.19,800**

నూర్పిడి అనంతరం వరి ధాన్యం రోడ్ల మీద ఆరబెడితే కొనుగోలు దారులు నేరుగా రైతుల వద్దకు వస్తున్నారు. పది మూటలు (ఒక

రోడ్డుపై ఆరవేసిన వరి ధాన్యం

పుట్టి) రూ.19,800 ధర పలుకుతోంది. ఈ ధరతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది వర్షాలు తక్కువ కావడంతో పండిన పంటకు భవిష్యత్తులో మరింత గిరాకీ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసానికి కూడా మంచి ధర పలుకనుంది.


హామీ పత్రాలను పంపిణీ చేస్తున్న హనుమంత్ నాయక్

## టిడిపిని గెలిపించుకుందాం..

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

2024 ఎన్నికల్లో జమ్మలమడుగు ఎమ్మెల్యేగా చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డిని గెలిపించాలని ఎస్‌టి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బుక్కె హనుమంతు నాయక్ కోరారు. సోమవారం మండల పరిధిలోని చిటిమిటి చింతల (పాటి) గ్రామంలో ఆయన భవిష్యత్‌కు గ్యారెంటీ హామీ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హనుమంతు నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మినీ మేనిఫెస్టోలో కొన్ని సంక్షేమ పథకాలు రూపొందించారన్నారు. వాటి ద్వారా రాష్ట్రాన్ని, ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. భవిష్యత్‌కు గ్యారెంటీలో ఉన్న అంశాలను కచ్చితంగా అమలు చేస్తామని భరోసా ఇస్తూ మీకు హామీ పత్రాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నవీన్ నాయక్, నరసింహ నాయక్ పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలోని అంగన్వాడీ పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ శ్రీలత తెలిపారు. సిడిఎస్ కార్యాలయంలో ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో ఒసికి సంబంధించి అంగన్వాడీ పోస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరులో ఒసికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 30లోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 నుంచి 35 ఏళ్లలో ఉన్నవారు అర్హులన్నారు. స్థానికంగా వివాహమై ఉండాలన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నూతన గవర్నర్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న తల్లం సుధాకర్

## సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ఆదర్శం

ప్రజాశక్తి - చాపాడు

వాసవిక్లబ్ వి 206 గవర్నర్ తల్లం సుధాకర్‌కు సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. మైదుకూరులోని ఓ కళ్యాణ మండపంలో తల్లం డిస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు త్రివేది వేణుగోపాల్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సేవాగుణం కలవారని తెలిపారు. తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూనే పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. ఏడాది పాటు గవర్నర్ పదవిలో ఉన్న తల్లం సుధాకర్ ఉమ్మడి కడప, అనంతపురం జిల్లాలలో అనేక నూతన వాసవిక్లబ్‌లను ఏర్పాటు చేసి కులమతాలకతీతంగా సేవా కార్యక్రమాలు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఉమ్మడి కడప, అనంతపురం జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ సాధించిన క్లబ్‌లకు గవర్నర్ తల్లం సుధాకర్ చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. 2024కుగానూ నూతన గవర్నర్‌గా పుట్టపర్తికి చెందిన సిహెచ్ వెంకటరమణ నియమించి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి మార్కాపురానికి చెందిన డైరెక్టర్ తులసి స్వప్న పర్యవేక్షలుగా వ్యవహరించారు. దాసా సందేశ్, సుంకు చంద్రశేఖర్, భూమా సూర్యనారాయణ, శేషఫణి, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నిబంధనలు పాటించని ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 1982 విద్యచట్టం ప్రకారం సెక్షన్ 84 మేరకు ప్రతినెల జీతాలతోపాటు పిఎఫ్, ఇఎస్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. ఇవి ఎక్కడా అమలు కాలేదన్నారు. ఉత్తర్వులను అమలు చేయని పాఠశాలలు చట్ట ఉల్లంఘన కిందకు వస్తాయన్నారు. ఇలాంటి వాటిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.


తిప్పిరెడ్డిపల్లె వద్ద సాగులో ఉన్న వేరు శనగ పంట

## విస్తారంగా వేరుశనగ సాగు

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో మండల పరిధిలోని పలు గ్రామాలలో వేరుశనగ సాగును రైతులు విస్తారంగా చేపట్టారు. ముఖ్యంగా పెన్నా నది పరివాహక గ్రామాలైన తిప్పిరెడ్డిపల్లి, అనంతపురం, రాజుపాలెం, నరహరిపురం, వెదురూరుతోపాటు ఇతర గ్రామాలు సిద్ధారెడ్డిపల్లి, మొర్రాయపల్లె గ్రామాల పరిధిలో 3 వేల ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేశారు. సాధారణంగా సెప్టెంబర్ నెలలో వేరుశనగ సాగు చేపడతారు. అయితే ఈ ఏడాది అక్టోబర్ చివరి వరకు సాగు చేపట్టారు. ఈ ఏడాది మైలవరం నుంచి పెన్నా నదికి నీటిని విడుదల చేయడంతో పంటకు సాగునీటి కొరత లేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వేరుశనగలో కలుపు తీస్తూ.. సత్తువ (ఎరువులు) చల్లుతున్నారు. రబీ సీజన్‌లో వేరుశనగతోపాటు రైతులు అధికంగా మినుము, మొక్కజొన్న కూడా సాగు చేపట్టారు. వెంగన్నగారిపల్లి, చియ్యపాడు గ్రామాల పరిధిలో శనగ పంట సాగులో ఉంది .

## కారు, లారీ ఢీ : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

చెన్నై నుండి వేంపల్లెకు వెళుతున్న కారును సోమవారం చెరువు కట్ట వద్ద ఎదురుగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కడపకు చెందిన కారు డ్రైవరు సతీష్‌కుమార్, వేంపల్లికు చెందిన లక్ష్మయ్య, రాజేశ్వరి గాయపడ్డారు. వేంపల్లికు చెందిన రాజేశ్వరి తన అయిదేళ్ల కుమారుడు శశాంక్‌తో కలిసి కువైట్ నుండి చెన్నై ఎయిర్ పోర్ట్‌కు చేరుకొని, తన తండ్రి లక్ష్మయ్యతో కలిసి కారులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. శశాంక్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. చికిత్స నిమిత్తం గాయపడిన వారిని 108 వాహనంలో కడపలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ మధుసూదన్‌రావు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి